క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రీన్ ఆంధ్రప్రదేశ్ థీమ్‌లో భాగంగా కార్యాలయం వద్ద మొక్కను నాటారు. మొక్కలు పెంచితే పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో శనివారం పర్యావరణ సంరక్షణపై కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్మార్ట్ విలేజ్ రివల్యూషన్ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ బేస్డ్ ట్రీ కేర్, ఎన్విరాన్‌మెంట్ స్టీవార్డ్ షిప్ సర్వేను పెనుమాకలో విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యార్థులు, ప్రజలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇది సామాజిక బాధ్యత

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించి మొక్కలు నాటాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. శనివారం తాడేపల్లి కొత్తూరులోని బకింగ్‌హామ్ కెనాల్ కాలువ వెంట మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా మూడో శనివారం ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణానికి నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు డి. రవికుమార్, షేక్ గౌసియా, మున్సిపల్ సిబ్బంది, టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ఫిరంగిపురం: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని సర్పంచ్ మధుసూదనరావు అన్నారు. మేరికపూడి సెక్టార్ పరిధి పానుగుపాడు బీసీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారం మాసోత్సవాలు నిర్వహించారు. మధుసూదనరావు మాట్లాడుతూ పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్, సూపర్‌వైజర్ చిన్నమ్మాయి, అంగన్‌వాడీలు కె.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

291వ రోజుకు దీక్షలు



తాడేపల్లిరూరల్: బ్రహ్మానందరం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారంతో 291వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ ప్రకటించి 33 ఏళ్లు అయ్యిందని, కార్మికులు న్యాయంగా వారికి రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరుతూ రిలే నిరాహారదీక్షలు చేపట్టి 291 రోజులు పూర్తిచేసుకుందని తెలిపారు. ఇప్పటికీ ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ముసలా సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరరావు, వై. సాంబశివరావు, దామవరపు నాగేశ్వరరావు, ఎం.ఆశీర్వాదం, కార్మికులు సుభాని, ఇస్మాయిల్, యెహోషువా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో అందరికీ మేలు

- ప్రజల పక్షాన పోరాటం
- నియోజకవర్గ సమన్వయకర్త డీవీఆర్



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీవీఆర్, నాయకులు

మంగళగిరి టౌన్: ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని 3, 5 వార్డుల్లో, రూరల్ పరిధిలోని కృష్ణాయపాలెంలో శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ శ్రేణులందరూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, జగన్ ప్రభుత్వంలో రైతులు, మహిళలు, విద్యార్థులకు జరిగిన మంచిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

బలోపేతానికి కృషి

వార్డు స్థాయి నుంచే వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతిసారి ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేయడం బాబుకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబును నమ్మితే మోసం గ్యారెంటీ అని ప్రతి ఒక్కరికి తెలిసేలా కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు 18 నుంచి 50సంవత్సరాల మహిళలందరికీ నెలకు రూ. 1500 ఇస్తామన్న బాబు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఇవ్వకుండా మొహం చాటేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన దానికంటే ఒక్క కొత్త పెన్షనైనా బాబు మంజూరు చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పోరాటాలతో కూటమి ప్రభుత్వం అరకొరగా తల్లికి వందనం పథకం అమలు చేశారని గుర్తు చేశారు. క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. మంగళగిరి పట్టణ పరిధిలో 3,5 వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లో మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, గౌరవ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, పట్టణ ఉపాధ్యక్షులు షేక్ మాబు, నేతలు సురేష్, వెంకట్, లక్ష్మణ్, సాంబయ్య, వెంకటేశ్వరరావు, మాదాల గోపి, శివ, నాగేశ్వరి, పద్మ, రూరల్‌పరిధిలోని కృష్ణాయపాలెంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రూరల్ అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ, నాయకులు షేక్ గౌస్, ఈపూరి కిరణ్ కుమార్, నాగేశ్వరరావు, పాల్‌రాజ్, వెంకయ్య, నాని, బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు లేకుంటే చర్యలు

కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి టౌన్: హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా హెచ్చరించారు. మంగళగిరి నగర పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు పలు ఆహార విక్రయ కేంద్రాల్లో కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారుల బృందం శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వివిధ హోటళ్ల, రెస్టారెంట్లలోని వంటగదులను, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా అలీమ్‌బాషా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్య విషయంలో రాజీపడేది లేదన్నారు. ఆహార విక్రయ కేంద్రాల నిర్వాహకులు తప్పని సరిగా పరిశుభ్రత, నాణ్యతతో పాటు పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించాలన్నారు. ఆహారం నిల్వచేసే విధానం, వంటశాలల శుభ్రత, వినియోగించే ముడిపదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన వస్తువులు వినియోగించకుండా ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనన్నారు. భవిష్యత్తులో ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు ఎక్కడైనా హోటళ్లలో అపరిశుభ్ర పరిసరాలు గమనిస్తే కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు.

చేనేత స్మాల్‌క్లస్టర్ అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో చేనేత కార్మికులు

మంగళగిరి టౌన్: మంగళగిరి రాజీవ్ గృహకల్ప రోడ్‌లోని కమ్యూనిటీ హాల్‌లో జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళగిరి చేనేత స్మాల్‌క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చేనేత నాయకులు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. చేనేత కార్మికులు తప్పని సరిగా ప్రభుత్వం అందిస్తున్న 90 శాతం సబ్సిడీతో మగ్గాలు, డాబీలు తదితర చేనేత వృత్తికి సంబంధించిన పరికరాలను సబ్సిడీపై 10 శాతం చెల్లించి లబ్ధి పొందాలన్నారు. ఈ క్లస్టర్‌లో మంచి డిజైన్లు రూపొందించేందుకు డిజైనర్ కూడా ఉంటారని, ఈ అవకాశాన్ని కార్మికులు వినియోగించుకోవాలన్నారు. మంగళగిరి స్మాల్ క్లస్టర్‌కు 97.54 లక్షల రూపాయలు మంజూరు కాగా, మొదటి విడతగా 33.37 లక్షలు విడుదలయ్యాయన్నారు. అనంతరం జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు సీహెచ్ సాయి ప్రసాద్ క్లస్టర్ అభివృద్ధి పథకాన్ని కార్మికులకు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత నాయకులు గుత్తికొండ ధనుంజయరావు, రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, జిల్లా చేనేత జౌళిశాఖ అధికారులు రాజవర్ధన్, శ్రీధర్ రాఘవరావు, ఉమా మహేశ్వరరావు, విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంట్ అధికారి దిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

మంగళగిరి టౌన్: ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలుగా ఉంటూ వస్తున్న ఓబీసీల ఓటు బ్యాంకును బీజేపీ కంచుకోటగా మలచుకునేందుకు వ్యూహరచన చేస్తోందన్నారు. 1వ, 2వ కేంద్ర ఎన్‌డీఏ ప్రభుత్వాల్లో జీఎస్టీ, త్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 రద్దు, మహిళా రిజర్వేషన్లు, జమ్మూ కాశ్మీర్ విభజన, సీఏఏ వంటి వాటిని సమర్థంగా అమలు జరిపిందన్నారు. 3వ సారి ప్రభుత్వం చట్టసభల్లో ప్రత్యర్థులు కోరుతున్న ఓబీసీ రిజర్వేషన్లు 46 శాతం అమలు జరిపేలా, మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసి, ఓబీసీ మహిళలకు సబ్‌కోటా ఇచ్చేలా విప్లవాత్మక రాజ్యాంగ బద్ధ చట్టాలను తీసుకువచ్చేందుకు ముందుకు వెళ్లాలని చూస్తోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, అనంతపురం జిల్లా అధ్యక్షులు భాస్కరబాబు, నాయకులు వెంకటేశ్వరరావు, కిరణ్, చందు, నాగుల్‌మీరా, దానాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి జన్మనిస్తే.. రక్తదాత పునర్జన్మనిస్తారు

తాడికొండ: తల్లి జన్మనిస్తే రక్తదానం చేసిన దాత పునర్జన్మనిస్తాడని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మోతడక చలపతి కళాశాలలో శ్రీ వెల్ఫేర్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 95 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ ఈవీ సుబ్బారావు, డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, వివిధ శాఖాధిపతులు జి.రామచంద్రరావు, డి.శంకరరావు, ఎస్ శాంతిప్రియ, వి సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌తో పారదర్శక సేవలు

తాడికొండ: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను ఆన్‌లైన్ చేయడంతో పారదర్శక సేవలు అందుతాయని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి అన్నారు. శనివారం తాడికొండ సచివాలయం-2 లో డిజిటలైజేషన్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డిజిటలైజేషన్‌తో లబ్ధిదారుల ఆరోగ్యం, విద్యా వివరాలు నిక్షిప్తమై ప్రభుత్వం అందించే అన్ని సేవలు సక్రమంగా అందేందుకు వీలుంటుందన్నారు. డాక్టర్ వీవీ శైలజ, ఆయుష్ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.నజీమా, హెచ్‌వీ శివకుమారి, ఎంపీహెచ్‌ఈవో మురళి తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు



తాడేపల్లి రూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఓ కారు అదుపుతప్పి ఇళ్ల మీదకు దూసుకువెళ్లింది. సేకరించిన వివరాల ప్రకారం మంగళగిరి వైపు నుంచి ప్రకాశం బ్యారేజ్ వైపు అతివేగంగా వెళుతున్న కారు ముగ్గు రోడ్డు వద్దకు చేరుకోగానే అదుపుతప్పింది. రెండు చెట్టు కొమ్మల నుంచి దూసుకుంటూ వెళ్లి ఓ ఇంటి ప్రహరీ గోడను ఢీకొని ఆగిపోయింది. ఐదడుగుల దూరంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సుమారు 10 నుంచి 15 మంది యువకులు కూర్చున్నారు. గోడను ఢీకొట్టకపోతే తమ మీదకు కారు వచ్చి ఉండేదని యువకులు వ్యాఖ్యానించారు. అతివేగమే ఘటనకు కారణమని స్థానికులు తెలిపారు. కారు ఢీకొట్టిన ప్రహరీ దగ్గరలో విద్యుత్ స్తంభం కూడా ఉంది. దీన్ని ఢీకొట్టి ఉంటే పెను ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు చెప్పారు.

123 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు గ్రామంలో శనివారం స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వ్యాధిగ్రస్తులు 123 మందికి సుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు యానీగ్రేస్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటలక్ష్మి, హెచ్‌ఎస్ సుదర్శన్‌రాజు, సర్పంచ్ దాసయ్య, కృష్ణమూర్తి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మంగళగిరి తాలూకా యూనిట్‌కు శనివారం మంగళగిరిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎలక్షన్ ఆఫీసర్ కూరాకుల శ్రీనివాసరావు తెలిపారు. అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఆర్.నాగేశ్వరావు, పరిశీలకులుగా ఎల్. శ్రీధర్‌రెడ్డిని జిల్లా కార్యవర్గం నియమించిందన్నారు. మంగళగిరి తాలూకా పరిధిలోని ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించి అర్హత ఉన్న ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు.

నేడు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 తేదీ ఆదివారం రాత్రి 7 గంటలకు నిర్వహించనున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారని పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైతులకు శిక్షణ

నీరుకొండ(మంగళగిరి): అమరావతి బహుముఖంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రాజధాని రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. మండలంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శనివారం రాజధాని రైతులతో సీఆర్డీఏ అధికారులు రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి హాజరైన రైతుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. రైతుల సహకారంతో అమరావతిలో త్వరలోనే ఈడీపీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్‌కు జెడ్పీ విద్యార్థులు

ఫిరంగిపురం: ఉమ్మడి గుంటూరుజిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాంగ్-తా-మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు వేములూరిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో శనివారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం సాంబయ్య మాట్లాడుతూ ఈనెల 19న చిలకలూరిపేటలోని ఏఎంజీ సంస్థలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు నలుగురు ప్రతిభ చూపారన్నారు. వారిలో అండర్ -14 బాలికల విభాగంలో ఉమారవలి, బాలుర విభాగంలో బి.మనోహర్, పి.జాన్ సైదా ఎంపికవ్వగా, అండర్-17 విభాగంలో పి.ఆరీఫా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏసీపీ రాజు, పీడీ సుజాత, ప్రమీల పాల్గొన్నారు.

లోప భూయిష్ట విధానాలతో ఇక్కట్లు



మంగళగిరి టౌన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోప భూయిష్టమైన 2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు రెండవరోజు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళగిరి దస్తావేజు లేఖర్లు, స్టాంప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంగళగిరి దస్తావేజు లేఖర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పుల్లా కృష్ణ, గౌరవ సలహాదారులు కుక్కమళ్ల జయరాజు మాట్లాడుతూ ఓటీపీ విధానం కేవలం యజమానికి మాత్రమే ఉండేవిధంగా చూడాలన్నారు. సాఫ్ట్‌వేర్ సాంకేతిక లోపాలతో దస్తావేజుల తయారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీన్ని సరిచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుధీర్ బాబు, పగిడి ప్రభుదాస్, ధనుంజయ రావులతో పాటు పలువురు డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- దస్తావేజుల లేఖర్ల పెన్‌డౌన్‌తో మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్ర, శనివారాల్లో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. ప్రతిరోజూ సుమారుగా 45 నుంచి 55 రిజిస్ట్రేషన్లు జరుగుతాయని అధికారులు తెలిపారు.